

# మొరసునాడు కతలు

# మొరసునాడు

# కతలు

సంపాదకులు

**స.వెం.రమేశ్**

**స.రఘునాథ**

కృష్ణగిరి జిల్లా తెలుగు రచయితల సంఘం

మొరసునాడు కతలు

ⓒ కృష్ణగిరి జిల్లా తెలుగు రచయితల సంఘం

విడుదల : ఫిబ్రవరి, 2013

ప్రతులు : 1000

అట్ట అలంకరణ : కె.రమేష్, తిరుపతి
డిటిపి : ఎం.గిరివర్మ, తిరుపతి

వెల : రూ. 200/-

ప్రతులకు : అన్ని ముఖ్యమైన పుస్తక కేంద్రాలు మరియు
కృష్ణగిరి జిల్లా తెలుగు రచయితల సంఘం,
2-1095, ఆవులపల్లి రోడ్డు, బస్తి,
హోసూరు - 635 109, కృష్ణగిరి జిల్లా,
తమిళనాడు.

ముద్రణ : సాయిబాండ్ ప్రింట్ సిస్టమ్స్ ప్రైవేట్ లి., చెన్నై
ఫోన్:+91 9380515095

# అంకితం



‘తెలుగువాణి’ని నెలకొల్పి
తమిళనాడులోని నూర్లపల్లెలలో
వేలచేతులకు తెలుగుప్రాలును
అందించి కొడిగడుతున్న
మా తెలుగుదివ్వెను తన చేతులతో
కాపుకాచిన మంచిమనిషి
**పెరుమారెడ్డి వేణుగోపాలరెడ్డి** గారికి
నిండుగుండెలతో...

# మూడు ముక్కలయిపోయిన ఒకతావు బతుకులు

మొరసునాడు కతలను చదువబోయే ముందు మా మొరసునాడును గురించి నాలుగు మాటలు వినుమని మనవి.

ఏలుబడికి అనువుగా తావులను వేరుపరచుకోవడం కొత్తతీరు ఏమీ కాదు, తొల్లి నుంచీ ఉన్నదే. మనిసి, ఏరుకొనో వేటాడుకొనో తినే నిలవరం(పరిస్తితి) నుంచి పండించుకొని తినే నిలవరానికి ఎదిగినప్పటి నుంచే తావుల వేరుపాటు మొదలయి ఉండాలి. ఒక్కొక్క గుంపు ఒక్కొక్క తావులో కుదురుకొని అక్కడ నేలను తీర్చి తమ పెత్తనం కిందకు తెచ్చుకొన్నప్పుడు, ఇంకొక గుంపు బతుకుతున్న తావుకూ తమ తావుకూ వేరిమి కోసం పేర్లను పెట్టుకొని ఉంటారు. ఆ పేర్లు ఆ తావు మన్నును బట్టీ అక్కడున్న ఎసరక(నేచర్) మార్పులనుబట్టీ చెట్టూచేమలనుబట్టీ పెట్టుకొని ఉంటారు. తరి(కాలం) పోకడలో గమి అచ్చుపాటు(గణవ్యవస్త)లు పోయి రాచట్టు పాటులు(రాజ వ్యవస్తలు) వచ్చినప్పుడు ఈ తావుపేర్లకు కొంత కుదురు ఏర్పడింది. అయినా అప్పుడు కూడా ఒక ఏలుబడి నుంచి మరొక ఏలుబడికి మారినప్పుడు ఈ పేర్లు మారడమూ, పేరుకలిగిన తావు కుదించుకోవడమూ లేకపోతే పక్కలకు పరచు కోవడమూ జరిగిన ఆనవాళ్లు ఎన్నో ఉన్నాయి. ఒక తావుపేరును గురించి మాట్లాడు కొనేటప్పుడు పై అన్ని ఎడాటాల(విషయాల)నూ చూసుకోవాలి.

**మొరసునాడు మెలన(చరిత్ర):–** మొరసునాడు మీద కన్నడంలో జరిగినంత అరయిక(పరిశోధన) తెలుగులో జరగలేదనే చెప్పాలి. మొరసునాడును గురించి తెలుగు అరయికరులు పట్టించుకోనే లేదు. 'మొరసు' అన్నమాటకు కన్నడ నుడిగంటు (నిగంటువు)లలో తెల్లము దొరకదు. కానీ 'మొరడు' అనే మాట కన్నడంలో ఉంది. దానికి 'రాళ్లూ గుట్టలతో నిండిన తావు' అని తెల్లము. 'మొరసు' అంటే 'గులకరాతినేల' అని తెలుగు నుడిగంటులలో ఉంది. మొరసునాడు మొత్తం ఎర్రగులకనేలే.

మెలనలోకి పోయి చూస్తే ఈ మొరసునాడు, గాంగ రాష్ట్రకూట రాచకుదురుల నడుమ జరిగిన పెనుపోరాటాలకు నెలవుగా కనిపిస్తుంది. ఆ తరిలో దొరికిన ప్రాక్రుత చెక్కింపులలో ఒక చోట దీనికి సణ్ణనాడు అనే పేరున్నట్లు తెలుస్తున్నది. చోళులు దీనిని నికరిలా చోళమండలం అన్నారు. నొలంబుల తరిలో నొలంబవాడి అని పేరు పడింది. మొరసునాడు అనే పేరు మట్టుకు క్రీ.త. 9వ నూరేడు నుంచీ చెక్కింపుల

(శాసనాల)లో కనుబడుతున్నది. మరలా ఈ మొరసునాడులోనే యలహంకనాడు, కూవూరునాడు, చీకలనాడు, హరుహనాడు వంటి చిరునాడులు ఉండేవి.

నానుడి మెలన(సాహితీచరిత్ర)ను చూస్తే మొరసు అనే మాట మొట్టమొదటిగా క్రీ.త. 15వ నూరేడులో కనబడుతుంది. బుక్కరాయల కొలువులోని దేవత్రాజు అనే కవి చెప్పిన పాడిక(పద్యం)గా చెప్పుకొనేదాంట్లో ఈ మాట ఉంది. రెడ్ల చీలికలను గురించి చెప్పిన పాడిక అది.

*పంటాన్వయమునను పదునాల్గు శాఖలు*
*చక్కగా వివరింతు సత్యమరసి*
*మోటాటి వెల్నాటి మొరసనేరెడయోధ్య*
*పంట పొంగలినాటి పాకనాటి*
*భూమంచి కురుచేటి మున్నూటి దేసటి*
*ఒనర గండియకోట వోరుగంటి*
*యన పరగుచునుండు నాంధ్రావనీస్థలి*
*గౌరవాధిష్టిత కాపుకులము.*

*పంట పదునాల్గు కులము లంచంట జగతి*
*తరతరంబుల నుండి వరలెడి నుడి*
*వీనికుపజాతులున్నవి వివిధములుగ*
*భుజబలాటోప పిన్నమ బుక్కభూప॥*

రెడ్ల చీలికలుగా చెప్పిన పై పద్నాలుగు పేర్లూ తావులను బట్టి ఏర్పడినవే. పాకనాడులో కాపుదనం చేసినవాడు పాకనాటికాపు, పంటనాటివాడు పంటకాపు అయినట్లే మొరసునాటివాడు మొరసుకాపు అయినాడు.

శ్రీనాదుని చాటుపాడిక ఒకదాన్లో మొరసునాడును గురించి ఉంది. మెలనకు అక్కరపడుతున్నది కాబట్టి ఈ పాడికను ఇక్కడ చెప్పవలసి వస్తున్నది కానీ నిక్కానికి ఇది చాలా ఉల్లము నొప్పించే పాడిక. తాను పుట్టిపెరిగిన నెల్లూరుతావును తప్ప మిగిలిన అన్ని తావులనూ ఈసడించుకొన్నట్లే మొరసునాడును కూడా ఈసడించు కొన్నాడు శ్రీనాదుడు. పాడికను చూడండి.

'వంకర పాగలున్ నడుము వంగిన కత్తులు మైలకోకలున్
సంకటిముద్దలున్ జనుపశాకములున్ బలుపచ్చడంబులున్
తెంకకు నోరచూపులును తేకువ దప్పిన యేసబాసలున్
రంకుల బ్రహ్మ యీ మొరసరాజ్యము నెట్లు సృజించెనక్కటా'

తెలుగన్నడ నానుడులలో మొరసునాడును గురించిన మిక్కిలిపాత ఆనవాళ్లు ఇవి రెండే.

**మొరసునాడు తావు:–** ఇప్పటి ఆంద్ర, కన్నడ, తమిళనాడులలో మూడు ముక్కలయి నిలిచి ఉంది మొరసునాడు.

కర్నాటకలోని కోలారు, చిన్నబళ్లాపురం, బెంగళూరునగర పెవ్వంటెము(జిల్లా)లు అంతా, బెంగళూరుగ్రామ పెవ్వంటెములోని పెద్దబళ్లాపురం, దేవునిపల్లి, కొత్తకోట (దొడ్డబళ్లాపుర, దేవనళ్లి, హొసకోట) వంటెములు(తాలూకాలు), ఆంద్రనాడులోని పాత కుప్పం, పలమనేరు, పుంగనూరు, హిందూపురం వంటెములూ మదనపల్లి వంటెములో ఎక్కువపాళ్లూ, తమిళనాడులోని హొసూరు, డెంకణికోట వంటెములూ, వేపనపల్లి పిర్కా కలిస్తే అప్పటి మొరసనాడు అవుతుంది. ఆంద్రనాడులో ఇప్పుడు మండలాల వాడుక ఉంది కాబట్టి మొరసునాడు కిందకు వచ్చే మండలాల పేర్లు ఇవీ. గుడిపల్లి, కుప్పం, శాంతిపురం, రామకుప్పం, వెంకటగిరికోట, బైరెడ్డిపల్లి, పలమనేరు, గంగవరం, పెదపంజాణి, సోమల, చౌడేపల్లి, పుంగనూరు, రామ సముద్రం, మదనపల్లి, నిమ్మనపల్లి, కురబలకోట, కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, హిందూపురం, చిలమత్తూరు, లేపాక్షి.

అయితే తొల్లినుంచీ మొరసునాడు ఇదే కొలతతో ఇట్లాగే ఉందా అంటే కాదనే చెప్పాలి. ముందే చెప్పినట్లుగా ఒక్కొక్క ఏలుబడిని తొడరి(అనుసరించి) ఎల్లలు అటు ఇటు మారుతూ ఉంటాయి. మొరసునాడు తొమ్మిదివేల ఊర్లని ఒక కన్నడ చెక్కింపులో ఉంది. ఒకానొక తరిలో పైన చెప్పిన ఎల్లలను దాటి తుముకూరు పెవ్వంటెములోని మదుగిరి, కొరటగిరి వంటెముల వరకూ రాయవేలూరు పెవ్వంటెములోని గుడి యాతం వంటెము వరకూ పరుచుకొని ఉండేది. మరొక తరిలో చిట్టిపులినాడు(నేటి చిత్తూరు తావు) పుంగనూరు వరకూ, తగుదూరునాడు(నేటి దర్మపురి తావు) రాయకోట వరకూ, పులినాడు(నేటి రాయవేలూరు తావు) వేపనపల్లి వరకూ తలెనాడు(నేటి చామరాజనగరు తావు) డెంకణికోట వరకూ, రొద్దనాడు(నేటి పెనుగొండ తావు) హిందూపురం వరకూ, రేనాడు(నేటి కడప, కర్నూలు) మదనపల్లి వరకూ చొచ్చుకొని రాగా మొరసునాడు కుదించుకొని పోయి ఉండేది.

మరి ఏ కొలతను ఆనుగా తీసుకొని మొరసునాడు ఎల్లలను గుర్తించాలి అనే ఇక్కట్టు ఎదురయింది. ఈ ఇక్కట్టును దాటడానికి మనిసి ఎసిది(ఆంత్రొపాలజీ) తోడు పడింది కొంత. మొరసునాడులోని కుదురుల(కులాల) వైపు చూస్తే మొరసు అనే పేరును తగిలించుకొన్న కుదురులు మూడు కనిపిస్తాయి. అవి మొరసుకాపు, మొరసుమాల, మొరసుశ్రీవైష్ణవ కుదురులు. చివరి కుదురువాళ్లు చాలాచాలా తక్కువ. మొరసు మాలలు కూడా మొరసునాడంతా పరచుకొని లేరు. మొరసుకాపులు మట్టుకు అంతటా నిండి ఉన్నారు. ఈ నాడులో విడివిడిగా ఒక్కొక్క కుదురునే లెక్కించి చూస్తే మొరసునాడు మొత్తంమీద మొరసుకాపులదే పెద్దగుంపు. వీళ్లు తూరుపు, వక్కణపు తావుల్లో రెడ్డి పట్టాన్నీ పడమర, తెక్కణపు తావుల్లో గౌడ పట్టాన్నీ పెట్టుకొంటారు. మొరసుకాపుల్లో రెండు చీలికలు ఉన్నాయి. వేల్లిచ్చేకాపులూ దొంగకాపులూ అంటారు

ఆ చీలికలను. కోలారు దగ్గరుండే సీతికొండ పైన మగపిల్లల ఎడమచేతి చిటికెన వేలును కోసి ఇచ్చే పబ్బితి(ఆచారం) ఉండేదంట ఈ కుదురులో. అట్లాగే ఇవ్వడానికి తీసుకొని పోతున్న ఇద్దరు పిల్లలలో చిన్నవాడు బెదరిపోయి దొంగతనంగా పారిపోయె నంట. వేలు ఇచ్చిన పెద్దవాడి కుదురు వేళ్లిచ్చేకాపులయినారు, పారిపోయిన చిన్నవాడి కుదురు దొంగకాపులయినారు. ఇదీ ఆ కుదురువాళ్లు చెప్పే కత. వీళ్లలో వేళ్లిచ్చేకాపుల ఇంటినుడి తెలుగు. దొంగకాపులది కన్నడం. వేళ్లిచ్చేవాళ్లలో మళ్లా చింపిరి, కొత్తదేవర, పెద్దదేవర వంటి సన్న చీలికలు ఉన్నాయి. అందరిదీ తెలుగునుడే. హిందూపురం, మదనపల్లి, పలమనేరు, చిన్నబళ్లాపురం, పెద్దబళ్లాపురం, శ్రీనివాసపురం, చింతామణి, బాగేపల్లి, గుడిబండ తావులలో నూటికి ఎనబైమంది తెలుగుకాపులూ ఇరవైమంది కన్నడంకాపులూ ఉంటారు. కోలారు, ముళబాగలు, కుప్పం, బంగారుపేట తావులలో కన్నడంకాపుల లెక్క నూటికి ముప్పయి దాటుతుంది. మాలూరు, హోసూరు, బెంగళూరుల్లో నూటికి అరవై మంది కన్నడంకాపులే. మళ్లా డెంకణికోట తావున సనత్కుమార ఏటి అంచు పల్లెలన్నీ తెలుగుకాపులమయం. ఆ తావున చెరిసగం ఉంటారు. మొత్తంమీద మొరసునాడు అంతా కలసి నూటికి అరవైమంది తెలుగు కాపులూ నలబైమంది కన్నడంకాపులూ ఉంటారు.

పైన తీసుకొన్న మొరసునాడు ఎల్లలను దాటి తుముకూరు తావులో కొందరూ, కృష్ణగిరి, దర్మపురి తావులలో కొందరూ మొరసుకాపులు ఉన్నా అక్కడ వారి లెక్క తక్కువ. హిందూపురానికి వక్కణంగా కానీ పలమనేరు చౌడేపల్లెలకు తూరుపుగా కానీ మొరసుకాపులు దాదాపు లేనట్లే. మొరసుకాపులు పరచుకొని ఉన్న తావును మొరసునాడుగా గుర్తించి ఈ ఎల్లలను తీర్మానించినాము.

మొరసునాడు కడలి మట్టానికి సరాసరిగా 2500 అడుగుల ఎత్తులో ఉంటుంది. నిండు ఎండతరిలో కూడా చల్లగా ఉండే తావు ఇది. నిండు చలితరిలో కూడా ఎముకలు కొరికే చలి ఉండదు. 35 డిగ్రీల సెంటీగ్రేడుకు మించని ఎండా 13 డిగ్రీలకు తగ్గని చలితో ఏడాది పొడవునా వెచ్చల్లని తావు ఇది. ఏనుగుమల్లమ్మకొండ (హార్సిలీహిల్స్), నందికొండ, తల్లి వంటి వేసవి విడుదలయితే 3500 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో ఉంటాయి. నందికొండలలో పుట్టిన పెన్నేరు రెండు పాయలయి వక్కణ(ఉత్తర)పు పాయ అనంతపురం, కడప, నెల్లూరులను తడుపుతూ పారితే, తెక్కణ(దక్షిణ)పు పాయ కృష్ణగిరి, దర్మపురి, సిరివన్నెమల(తిరువణ్ణామలై), విల్లుపురం, కడలూరులను తాకుతూ పోతుంది. ఇవి రెండేకాక పాపాగ్ని, చిత్రావతి, సనత్కుమార, పాలేరు, వన్నేరు వంటి చిన్నా సన్నా ఏరులకెన్నింటికో పుట్టినిల్లు మొరసునాడు.

ఇక్కడి మందికి వంచ(ముక్య)మైన తిండిపంట రాగి. అనుములూ వెర్రినూగులూ కూడా ఈ తావున తనిక(ప్రత్యేక)మైన పంటలు. ఈ తావులోనే తినగలిగిన వంట కాలూ, ఈ తావులోనే కనిపించే పల్లెకళలూ పండగలూ పరసలూ, ఈ తావులోనే వినగలిగిన ప్రాతెలుగు సొబగులూ పద్దెనిమిదికోట్ల తెలుగు ఎనము(జాతి)లో మొరసు

నాడు గొప్పతనాన్ని ఎత్తిచూపుతుంటాయి. మొరసునాడు మొత్తంమీద నూటికి ఏభై మంది తెలుగువాళ్లూ ముప్పయిమంది కన్నడిగులూ పదిమంది తమిళులూ పదిమంది వేరేనుడులవారూ ఉంటారు. హోసూరు తావు తమిళనాడులో ఉండిపోవడం వలన తమిళదొరతనా(ప్రభుత్వా)లు పనికట్టుకొని ఈ నేలకు తమిళులను ఎగుమతి చేసి తమిళనుడి లెక్కను పెంచినాయి. అట్లాగే కోలారు బంగారుగనులలోనూ బెంగుళూరు నగరంలోనూ పనిపాటుల కోసం వచ్చి కుదురుకొన్న తమిళులు కూడా ఉన్నారు. ఇప్పటి బెంగుళూరు నగరం కర్నాటకకు తలనగరం అయినాక వేరేతావుల నుంచి కెలసము(ఉద్యోగం) కోసం వచ్చి కుదురుకొన్న కన్నడిగులూ ఎక్కువే. ఇవన్నీ లెక్కకట్టితే కూడా నూటికి ఏభైకి తగ్గదు తెలుగువాళ్ల లెక్క.

మొరసునాడు మంది బతుకులు వింతగా కనిపిస్తాయి. పొరుగుతావులవారికి అంతుపట్టనంత గొప్పగా ఉంటుంది ఇక్కడి బతుకు. ఆసియా తునక(ఖండం)లోనే పేరెన్నికగన్న నెప్పాటు(పారిశ్రామిక)వాడ హోసూరు, తూరుపు పెన్నాడు(దేశా)లలోనే సిలికాన్ లోయగా పేరుగాంచిన బెంగుళూరు, రెండూ ఈ మొరసునాడులోనే ఉన్నాయి. అయినా ఈతావు మంది మట్టితావిని ఇంకా అంటిపెట్టుకొనే ఉన్నారు. ఉరువుతగులము(వస్తువ్యామోహం)కు రవంత ఎడంగానే నిలబడి ఉన్నారు.

ఇది నెల్లో పొల్లో తెలుసుకోవాలంటే మొరసునాడు పల్లెలలోకి పోనక్కరలేదు, బెంగుళూరు నగరంలోనే కనబడుతుంది. 1960ల వరకూ పట్టుమని పది తెరువులు కూడా లేని బెంగుళూరు, ఇప్పుడు పదుల నూర్ల పల్లెలను మింగి పెన్నగరమయింది. అయినా నగరపు కడుపులో ఆ పల్లెలు పల్లెలుగానే ఇంకా ఉన్నాయి. ఇది మరే నగరములోనూ కానలేని విడ్డూరం. నగరం పెరుగుతూ వచ్చి మింగేసినప్పుడు పల్లెచుట్టూ ఉన్న పొలాలన్నీ వెలినెలవు(లేఅవుట్)లుగా మారి, ఆ నెలవుల్లో సంత మేడలూ(షాపింగ్‌మాల్స్) దొంతిమేడలూ(అపార్టుమెంట్లు) నింగిని అంటుతా నిలబడినా పాతపల్లె మట్టుకు, నాటుపెంకుల కప్పులతో తలవాకిటికి ఇరుపక్కలా నిలువెత్తున నిలిచిన జగిళ్ల(అరుగుల)తో కనిపించే ఇళ్లతో ఇప్పటికీ నిలిచి ఉంది. ఆ చేరెడు ఇంట్లోనే ఒక మూలన ఒక ఆవూ, మరొక మూలన కప్పెట్టిన నాలుగుకోళ్లూ, ఆవుకోసం ఒక కసువుగాడి, కోళ్లకోసం రెండు మక్కరు(గంప)లూ కనబడతాయి. పక్కనే మిన్నంటుతున్న మేడలలో వలసవచ్చినవాళ్లు నడిరేయి వరకూ డిస్కో తెక్కులలో తైతక్కలాడుతా ఉంటే, అదే పొద్దులో జగిలిమీద కూచుని ఆవుకు జొన్నకడ్లు తినిపిస్తా 'సీతమ్మకు చేయిస్తి చింతాకు పతకము రామచంద్రా' అని పాడుకొంటా కనిపించే పల్లె పెద్దాయనా ఇప్పటికీ ఉన్నాడు. అయిదు చుక్కల కూటింట్లో పదిముక్కలతో కడుపు నింపుకొనేవాళ్లకు పక్కనే మూలింట్లో(వంటింట్లో) పీటమింద కూచుని ఉడుకుడుకు సంగటిని ఉలవచారులో అద్దుకొని మింగేవాళ్లూ ఉన్నారు.

ఇది పేదరికం వలన వచ్చిన బడుగుబతుకు కాదు. ఇది ఈ తావు ఎసలు (స్వభావం). మట్టితావి ఎరుగక, కస్తూరి జవ్వాది తట్టుపునుగులలో మునిగిన వాళ్లకు

– అది శ్రీనాదుడయినా ఏ నాదుడయినా – ఈ బతుకుల్లో మైల తప్పితే సొబగు ఎక్కడ కనబడుతుంది!?

ఇదంతా మీముందు ఉంచడానికి రెండు నెపములు ఉన్నాయి. మొదటిది చిన్నది – అయిదువందల ఏండ్ల తరువాత అయినా శ్రీనాదుని వెక్కసానికి మారు పలుకడం. రెండవది పెద్దది, అదే మోగ(ప్రదాన)మైనది కూడా – నుడులపేరుతో గిరిగీసుకొన్న ఆంధ్రులు, ఇప్పటికయినా అది ఏలుబడిగిరి మట్టుకే అని గుర్తించాలని మా తపన. నుడివిసాగు(భాషా సంస్కృతుల)ల పరంగా తెలుగుగిరి చాలా పెద్దదిగా గుర్తింపులోకి రావాలన్నదే మా కోరిక. ఆ గిరిలోనయినా మా మొరసునాడు చేరాలన్నదే మా ఆతురత. అట్లా జరిగినప్పుడు మా మొరసునాడు గురించే కాదు, మొరసునాడుకు నూర్లమైళ్ల తెక్కణంగా ఉన్న వరుసనాడు (తేని పెవ్వంటెములోని మరొక తెలుగుతావు) గురించి కూడా తెలుగులో అరయిక జరుగుతుంది. ఆంధ్రనాటి తెలుగుపెద్దలూ తెలివిపరులూ, ఆ దిక్కుకూ చూపు సారించాలని మా మనవి.

ఈ పొత్తంలో మొత్తం ముప్పయి కతలున్నాయి. మొదటి పదికతలు ఆంధ్రతావు మొరసునాడు వాళ్లు రాసినవి. రెండవ పదీ కర్నాటకతావు మొరసునాడువాళ్లు కన్నడములో రాసినవి. వాటిని తెలుగులోకి మార్చి మీ ముందు ఉంచినాము. మూడవ పదీ తమిళనాడులో చేరిపోయిన మొరసునాటి కతలు. ఈ తావున ఇప్పటికీ తెలుగుబడులే ఎక్కువగా ఉన్నందున వీళ్లు తెలుగులోనే రాయగలిగినారు. హోసూరు తావునుంచి వచ్చిన కతలన్నింటిలోనూ మొరసునాటి తావి ఉంటుంది. కోలారు తావు కతలలో కూడా చాలా వాటిలో ఈ మన్నుగమ్ములు గుమగుమలాడుతాయి. ఎటొచ్చీ ఆంధ్రతావు నుంచి వచ్చిన కతలలో రెండుమూడు తప్ప మిగిలినవేవీ మొరసునాటి బతుకును ఎత్తి చూపించలేకపోయినాయి. ఈ చిన్నలోటే తప్ప అవి చాలాచాలా గొప్ప కతలు.

కతల ఎంపికలో మాకు తోడుపడిన వారు మదురాంతకం నరేంద్రగారు, ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు గారు. పని బరువులో కూడా పాలు పంచుకొన్నారు వీరిద్దరూ. కన్నడ కతలను ఎంపిక చేయడం, పంపించడం... ఆ మోపిక (బాధ్యత)ను ఓపికగా మోసిన వారు స.రగునాదగారు, బెంగళూరులో ఉండే రాగవయ్య మాస్టారు, టి.ఎస్.ఎ. క్రిష్ణమూర్తి, కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్లే, డా॥ మల్లెల గురవయ్య, పలమనేరు బాలాజి, సుంకోజి దేవేంద్రాచారి, సడ్లపల్లె చిదంబరరెడ్డి, అమరనారా బసవరాజు, ఎన్.సురేక, పూతలపట్టు రగునాదరెడ్డి గార్లు అందరూ ఈ పెద్ద పనిలో అండదండయి నిలబడినారు. నంద్యాల నారాయణరెడ్డి, కె.ఎస్.నరసింహమూర్తి గార్లు కన్నడ కతలను వివరవిర తెలుగుకు మార్చి ఇచ్చినారు. పై అందరికీ పేరుపేరునా మప్పిదాలను తెలుపుకొంటున్నాము.

కుఱుమాపు చీరెల కోమలుల్ చెన్నొప్పు
ముద్దబంతులు సిగల్ ముచ్చటించు
ఉలువలు పితుకు బేడలు చారులందున
కమ్మని సంగటి కబళ రుచులు
పశుగణంబుల దమ శిశువులన దలంపు
గోవుల ప్రేమించు గొప్పదనము
మందు వేసవినైన మనసుకు హాయిగ
పిల్లవాయువులిచ్చు చల్లదనము
అతియనావృష్టుల కందక పదునుగా
ముక్కారు పండెడి పుణ్యభూమి
తెలుగులేలుబడుల తెలుగు వైభవముల
గుఱుతులకు గుఱుతీ మొరసునాడు!

తియ్యని తెలుగు పలుకుల తేనె తుట్టె
సామెతల సంప్రదాయాల చప్పరమ్ము
పల్లెకళల పరస ప్రాచ్య పదముల గని
జానపదములు నుడులకు జన్మభూమి
పుడమిని తెలుగుతల్లికి పుట్టినిల్లు
కలిసి మంచి పండించు మాగాణి పొలము
మఱచిన తెలుగుమాటలు దొఱకుచోటు
మఱువలేని తెలుగునాడు మొరసునాడు

శ్రీనాదుని వెక్కసపు పాడికకు మా మొరసునాటి వారి మారు పాడిక ఇది. దీనిని నా.వెం. అశ్వత్తరెడ్డిగారు రాసినారు. వారికి మప్పిదాలు.

**స.వెం.రమేశ్**

**కృష్ణ.ర.సం. సబ్యుడు**

# మూడుచాళ్లు


***ఆంధ్రా కతలు*** ***15***

| | | |
|---|---|---|
| మధురమీనాక్షి | **-కీ॥శే॥ఆర్.ఎస్.సుదర్శనం** - | 16 |
| జాన్‌పాల్ చేసిన బీరువా కథ | **-ఆర్.వసుంధరాదేవి** - | 35 |
| తరంగాలు | **-సనగరం పార్థసారథి** - | 48 |
| రానున్న శిశిరం | **-కీ॥శే॥వల్లంపాటి వెంకటసుబ్బయ్య** - | 56 |
| మీరయితే ఏం చేస్తారు | **-నాయుని కృష్ణమూర్తి** - | 77 |
| ఇసక | **-సడ్లపల్లె చిదంబరరెడ్డి** - | 84 |
| అన్నంగుడ్డ | **-సుంకోజి దేవేంద్రాచారి** - | 94 |
| జింకపిల్ల | **-కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళై** - | 109 |
| జాడ | **-పలమనేరు బాలాజి** - | 124 |
| చివరి మజిలీ | **-టి.ఎస్.ఎ.కృష్ణమూర్తి** - | 136 |

***కర్నాటక కతలు*** ***153***

| | | |
|---|---|---|
| ఇంటిముందర పిల్లలు | **-కీ॥శే॥కె.వి.అయ్యర్** - | 155 |
| వెంకటగాని పెండ్లాము | **-కీ॥శే॥మాస్తి వెంకటేశ అయ్యంగార్** - | 165 |
| నేను చంపిన యువకుడు | **-బి.ఆర్.లక్ష్మణరావు** - | 177 |
| ఎదగలేనివారు | **-మాలూరు వెంకటస్వామి** - | 191 |
| యాది పండగసంత చేసింది | **-స.రఘునాథ** - | 204 |
| అమ్మకొంక చీర | **-డా॥ కె.ఆర్.సంధ్యారెడ్డి** - | 211 |
| తనిఖీ | **-ఆర్.విజయరాఘవన్** - | 219 |
| శబ్దాల వెలుగులో | **-కె.నరసింహమూర్తి** - | 225 |
| రగిలిన పేగు | **-డా॥ కె.ఎన్.గణేశయ్య** - | 234 |
| బి.డి.ఎ.వెలినెలవు & చిక్కతాయమ్మ నేల | **-జె.బాలకృష్ణ** - | 245 |

**_తమిళనాడు కతలు_** **_257_**

| | | |
|---|---|---|
| మా ఊరు ఎత్తేస్తారా | **-ఎద్దుల సత్యనారాయణరెడ్డి** - | 259 |
| పాటల పెట్టి | **-నా.వెం.అశ్వత్థరెడ్డి** - | 264 |
| కూరేశి కాశిరడ్డి | **-నంద్యాల నారాయణరెడ్డి** - | 270 |
| నీడనీళ్లు | **-డా॥ ఎన్.వసంత్** - | 275 |
| కూరాకవ్వ | **-వి.నీలావతి** - | 281 |
| జకనపెల్లి దేవగౌని జాలెద్దు | **-అమరనారా బసవరాజు** - | 286 |
| గౌరమ్మ పండుగ | **-చిన్నయ్యగారి మహేశ్** - | 291 |
| కావేరత్త మడుకు | **-కెం.మునిరాజు** - | 297 |
| ఏనుగుల బాయి | **-టి.ఆర్.శ్రీనివాస ప్రసాద్** - | 303 |
| సిడిమొయిలు | **-స.వెం.రమేశ్** - | 311 |

# మొరసునాడు


ఆంధ్రప్రదేశ్
కర్నాటక
తమిళనాడు
N
S
E
W
I
II
III
I. ఆంధ్రప్రదేశ్ మొరసునాడు
1. హిందూపురం
2. బీరంగి కొత్తకోట
3. మదనపల్లి
4. పుంగనూరు
5. పలమనేరు
6. కుప్పం
II. కర్నాటక మొరసునాడు
1. గౌరీబిదనూరు
2. చిక్కబళ్లాపుర
3. దొడ్డబళ్లాపుర
4. బెంగళూరు
5. కోలార్
6. శ్రీనివాసపుర
7. చింతామణి
8. ఆనేకల్లు
III. తమిళనాడు మొరసునాడు
1. హోసూరు
2. డెంకణికోట

# ఆంధ్రప్రదేశ్ కతలు



**కీ॥శే॥ఆర్.ఎస్.సుదర్శనం**

మదనపల్లెలో జననం. సాహితీ బ్రహ్మర్షిగా ఆయనను చెప్పుకొంటారు. 17 దాకా కథలు, అనుబంధాలు, మూడు నవలలు ఆయన రాసినారు. సంసార వృక్షం నవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డును పొంది, ఇతర భాషల్లోకి అనువాదమయ్యింది. సాహిత్యంలో దృక్పథాలు, సమాజము సాహిత్యం పేరున ఆయన రాసిన వ్యాసాలకు సాహిత్యవిమర్శ కింద ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. *నిశాంతం* అనే కావ్యం, *సాహిత్య నేపథ్యం, కవి హృదయం, చలంజీవితం-సాహిత్యం* మొ॥నవి వారి విమర్శనాత్మక గ్రంథాలలో ముఖ్యమైనవి. ఆయన సమీక్షించిన పుస్తకసమీక్షలు నూరు సమీక్షలుగా వెలువడింది. విద్యారంగంలో, సాహిత్యరంగంలో అనేక పురస్కారాలను పొందినారు.

# మధుర మీనాక్షి

దక్షిణాదికి వెళ్ళాలనిపించింది. ముఖ్యంగా మధురకు. మధుర అనే పేరూ, మధురలో అమ్మవారు మీనాక్షి పేరూ అంటే నాకేదో యిష్టం. ఇరవై ఏళ్ళ క్రితం నేను మద్రాసులో చదువుకునేటప్పుడు మధురనుంచి వచ్చిన స్నేహితుడు ఒకడుండే వాడు. అతడు నాతో తెలుగులో మాట్లాడటానికి ప్రయత్నించేవాడు. వాళ్ళింట్లో తెలుగు మాట్లాడుతారట. కాని ఆ తెలుగు స్వరూపం వింతగా ఉండేది. ఆ తెలుగుని నాముందు తప్ప అందరి ఎదుటా ప్రదర్శించేందుకు బిడియపడేవాడు నా స్నేహితుడు. మా మధ్య చనవు ఎక్కువయ్యాక అతని మాతృభాష అయిన ఆ తెలుగు-కాని-తెలుగులోనే నాతో మాట్లాడేవాడు. అందువల్ల మా స్నేహం ఎంతో ప్రియమైనదిగా ఉండేది. కాలేజి వదిలాక మామధ్య రెండేళ్ళపాటు ఉత్తరప్రత్యుత్తరాలు జరిగినా, తర్వాత అతనెక్కడున్నాడో నాకు తెలీదు. భాషప్రయుక్త రాష్ట్రాలు వచ్చాక ఎవరి ప్రపంచం వారిదై పోతూ వచ్చింది. ఇప్పుడు దక్షిణాదికి వెళ్ళాలనిపించగానే ఆనాటి మధుర స్నేహితుడు - అతనిపేరు గురుమూర్తి - జ్ఞాపకంవచ్చి, స్నేహంకంటె తియ్యనిది జీవితంలో మరొకటి ఉందా అనిపించింది.

నేను వెళ్ళాలనుకున్నది యాత్రగా కాదు, పుణ్యం మూటకట్టుకుందామన్న ఉద్దేశంతోకాదు. ఒక్కసారి నా పరిసరాల్నీ, నాకు నిత్యమూ సంబంధం ఉన్న మనుష్యుల్ని, నేను నిత్యమూ వింటూన్న భాషనీ వదలిపెట్టి కాస్త స్వేచ్ఛగా క్రొత్త వూపిరి పీల్చుకునేందుకు వీలుగా, నాకెవ్వరూ తెలీని ప్రదేశానికి వెళ్ళి గడపాలనే కోరికే నన్ను ప్రయాణానికి పురికొల్పింది.

కాలేజి చదువు అయ్యేదాకా నా జీవితంలో ఒక అధ్యాయం, అటు పైన గడచిన ఇరవై ఏళ్ళుగా మరొక అధ్యాయం. రెండేళ్ళక్రితం నా భార్యపోవటం, నా నలుగురు పిల్లలూ ప్రస్తుతానికి బోర్డింగు స్కూళ్ళల్లో నిక్షేపంగా చదవుకుంటూ ఉండటం, నాలో ఏర్పడిన ఒంటరితనం, క్రమంగా నా దృక్పథంలో ఒక పరివర్తన తీసుకువచ్చింది. వ్యాపారంలోనేమి, వ్యవహారాల్లోనేమి పూర్తిగా మునిగిపోయి ఉండటం, ఎప్పుడూ క్షణం తీరిక లేకపోవడం మూలాన ఈ నా 'ఒంటరితనాన్ని' సులువుగా నేను గుర్తించలేదు. కాని మధ్యమధ్య ఒక్కొక్కసారి నాలో ఏదో పరధ్యానంలాంటి మనఃస్థితి కల్గి, నేను పరిసరాల్ని మరచిపోయి, కాస్సేపటికి మళ్ళీ స్ప ృహ రావటంలాంటి సన్నివేశాలు కొన్ని కలిగాయి. ఒకసారి ఒక డాన్సు ప్రోగ్రాం చూడటానికి వెళ్ళాను స్నేహితులతో. నృత్యం మనస్సుకి పట్టలేదు సరికదా, ఉన్నట్లుండి ఏదో దిగులు, శూన్యం ప్రవేశించి సుమారు ఒక గంటకాలం నాకూ పరిసరాలకూ సంబంధంలేని స్థితి ఏర్పడ్డది. తర్వాత ఒకసారి స్నేహితులతో క్లబ్బులో పేకాడుతూ ఉండగా ఉన్నట్లుండి విరక్తిలాంటిదేదో కల్గి ఆటలోంచి లేచి వెళ్ళిపోయాను. అదృష్టవశాత్తూ నేను అప్పటికి ఆటలో ప్లస్‌లోనే ఉన్నాను కాబట్టి మిత్రులు అపార్థం చేసుకోలేదు. అలావెళ్ళి బాత్‌రూమ్‌లో ముఖం కడుక్కునివచ్చి వేరుగా కుర్చీ వేసుకుని కిటికీలోంచి ఆకాశాన్ని చూస్తూ కూర్చుండి పోయాను. అదెంతో హాయి అనిపించింది. ఇటువంటి 'మూడ్సు' తరచు వస్తూ వస్తూ, చివరకి నేనిందాకా చెప్పినట్లు ఎక్కడికైనాసరే, ఎవరితోనూ చెప్పకుండా కొన్నిరోజులు వెళ్ళి తిరిగిరావాలన్న గాఢమైన వాంఛ నాలో రూపొందింది.

కాని ఎవరితోనూ చెప్పకుండా వెళ్ళడంలో ఎన్నో చిక్కులున్నాయి. నిజంగా చూస్తే నన్యసించి వెళ్ళిపోదామనే ఉద్దేశంలాంటిది నాలో ఏకోశానా లేదు! పిల్లలమీద ప్రేమా, వాళ్ళ భవిష్యత్తుమీద ఆసక్తీ నాలో అధికంగా ఉన్నాయి. వ్యాపార విషయాల్లో నా ప్రమేయంలేనిదీ, నా జాగ్రత్తలేనిదీ అన్నీ సవ్యంగా జరుగుతూ ఉంటాయనే నమ్మకమూ నాకు లేదు. అందువల్ల ఏదో మామూలు కారణంలాంటిది చూపిస్తూ ఎవరెవరికి ఏమి చెప్పాలో చెప్పి వెళ్ళడమే మంచిదని తోచింది. కాని నా 'మూడ్స్' విషయం, నా అసలు రహస్యం మాత్రం ఎవరికీ చెప్పే పరిస్థితిలో లేను. మిత్రులుగాని బంధువులుగాని నన్ను పిచ్చివాడిగా జమకట్టుతారని భయం! అందువల్ల నేను

దక్షిణాదికి యాత్ర వెడుతున్నాననీ, ముఖ్యంగా నా భార్య అస్థికల్ని రామేశ్వరం తీసుకువెళ్ళాలన్న కోర్కె నాలో ఉన్నదనీ, తీరిక లేక ఇంతకాలం వెళ్ళలేకపోయాననీ, అందరితో లోకరీత్యా చెప్పవలసి వచ్చింది.

"అయితే పెద్దబ్బాయినైనా తీసుకువెళ్ళరాదా" అని కొందరు సలహా యివ్వక పోలేదు. "వాడికి సెలవులు వచ్చేదాకా ఆగితే నాకు తీరిక చిక్కదుకదా! ఇప్పుడను కున్నాను, ఇప్పుడే వెళ్ళి రావటమే మంచిది" అని సమాధానం చెప్పాను. ఆలస్యం చేస్తే వాళ్ళూ వీళ్ళూ వెంట బయలుదేరుతారేమోనని అనుకున్న మూడోరోజే రైలెక్కాను, ఒక చిన్న సూట్‌కేసుతో.

రైల్లో కూర్చోగానే నాకో ప్రశ్న ఎదురైంది. ఏమిటి నేను చేస్తున్న ఈ పిచ్చిపని? ఈ అర్థంలేని పని? నేనెందుకు మధుర వెళ్తున్నానో నాకే తెలీదుకదా! అనిపించింది. మామూలు వ్యవహారాల్లో మునిగి ఉన్నంతసేపూ, అందులోనుంచి బయటపడాలనే ఏదో ఒత్తిడివల్లా 'మధుర' అనే పదం అంటే ఏదో యిష్టం ఉండటంవల్లా, బయలు దేరానే కాని అలా బయటపడి మధుర చేరుకున్న తర్వాత ఏమి చెయ్యాలి? అనే విషయం మాత్రం నాకు స్పష్టంగాలేదు. రైల్లో కూర్చుని ఆలోచిస్తే అంతా బోధ పడుతుందని కాబోలు అభిప్రాయపడ్డాను. కాని తీరాచూస్తే ఎంత ఆలోచించినా, ఏంచెయ్యాలో యిదమిత్థమని తేలటంలేదు. పోనీ, ఎప్పుడూ చూడని మధురనుచూచి, మీనాక్షి దేవాలయాన్నీ తిరుమలనాయకుని మహల్నీచూచి రెండు మూడురోజుల్లో వచ్చేద్దామనుకున్నాను. అందుకోసమైతే మిత్రులతో కలిసి వెళితే బాగుండేదికదా అన్న కొరత మనసుకు తట్టింది. మళ్ళీ మిత్రులా? అసలు తెలుగుభాషేవద్దు, తెలిసిన జీవితమే వద్దు, అన్నీ మరచిపోయి స్వేచ్ఛగా ఉండాలనికదా నా ఉద్దేశం! పోనీ గురుమూర్తి ఎక్కడున్నాడో అన్వేషిద్దామా? మధురవంటి పెద్ద పట్టణంలో పాత అడ్రస్ అయినా గుర్తులేని ఒకానొక గురుమూర్తిని ఎలా పట్టుకోవడం? పైగా విచిత్రం, గురుమూర్తికోసం కష్టపడి వెదకడంలో కూడా నాకు అసక్తిలేదని తేలిపోయింది! యాదృచ్ఛికంగా గురుమూర్తి కనిపిస్తే అది వేరే సంగతి. అప్పుడు సంతోషమే! కాని అతణ్ణి వెదకటానికికాదుగా నేను మధుర వెళ్తూండటం! పోతే, భక్తి, పుణ్యము, తీర్థసేవ అంటే అటువంటి వాటిమీద నాకు అసలు నమ్మకంలేదని మొదటే చెప్పాను.

ఇలా ఆలోచిస్తూ, ఏమీ పాలుపోక, పూరికే ఎక్కి దిగే మనుష్యుల్నీ, రైల్వేస్టేషన్లనీ చూస్తూ కూర్చున్నాను. అలా చూడటంలో నాకు కొన్ని కొత్త సంగతులు తెలిసినవి. సాధారణంగా మనం మనుష్యుల్ని ఒక అర్థంతో చూస్తూ ఉంటాము. వీడు ఫలానా, వీడితో యీపని, ఈమె ఫలానావారి తాలూకు, ఈమె గుణం యిలాంటిది అన్న దృష్టి వ్యక్తుల్ని గూర్చిన పరిచయంమూలన, నిత్యమూ కొన్ని ప్రయోజనాల్ని అన్వేషిస్తూ

వ్యవహారదృష్టితో చూస్తూండటం తప్ప, ఆయా వ్యక్తుల్లో ఉన్న వింతలూ, చమత్కారాలూ మనం గమనించము. అదీకాక మనిషి మామూలు మనిషి అన్నభావంతోగాక ఒక యంత్రము, ఒక బొమ్మ, ఒక వింత మృగము అనే దృష్టితో చూస్తే మరికొన్ని చమత్కారాలు కనిపిస్తాయి. రైల్లో నా ఎదురుగా ఒక కుటుంబం, అంటే భార్యాభర్తలూ వాళ్ళ ఆరేళ్ళ కూతురూ కూర్చున్నారు. చూడగానే వాళ్ళ పరస్పర సంబంధం వగైరాలు అర్థమయినవి. కాని నా మనస్సు ప్రస్తుతం అనుభవిస్తున్న వింతస్థితిలో వాళ్ళకు ఒకరితో ఒకరికి సంబంధం లేదనుకుంటూ వాళ్ళను గమనించాను. ఆ అవగాహన అద్భుతంగా ఉంది. ఎవరికివాళ్ళు ఒంటరివాళ్ళే, నాలాగ. పైన ఏవో శబ్దాలూ, చేష్టలూ, వాటికి ఏవో అర్థాల మూలంగా మనస్సులో ఒక ఎడతెగని భ్రమ! అంతే! భర్త కొన్ని నిముషాలు మరుగుదొడ్డిలోకి వెళ్ళాడు. వెంటనే భార్య హావభావాల్లో మార్పు కనిపించింది. నావైపు సిగ్గువిడిచి ఆసక్తిగా, సాహసంగా, పరిశీలనగా చూచింది. అటూ, ఇటూ కదిలింది, వస్తువుల్ని సవరిస్తూ కూతురితో ఏదో అన్నది. నాకూ ఏదో వ్యక్తం చేసింది. భర్త తిరిగివచ్చి కూర్చున్నాడు. ఆమె మళ్ళీ పూర్వం ధోరణిలో 'అణకువ'గా, స్తబ్ధంగా మారింది. భర్త సాన్నిధ్యం ఆమె నిజస్వరూపాన్ని కప్పిపెడుతూ ఉన్నట్లు నాకు తోచింది. ఇందులో ఆమె భర్తను ఏదో మోసంచేస్తున్నదనీ, కపటంగా ప్రవర్తిస్తున్నదనీ నా ఆరోపణ కాదు! నైతిక వ్యతిక్రమణం ఏమీలేదు. ఆమె వ్యక్తిత్వం మాత్రం భర్త ఎదురుగుండా ఉండటంవల్ల ఒకానొక ధోరణిలోనూ, లేకపోయిన క్షణాలలో మరొక ధోరణిలో అంటే స్వేచ్ఛగానూ ఉంటుందనేది నాకు నిశ్చయంగా తెలిసింది. ఆమెలోని ఆ రెండవ ధోరణి, దాని సౌందర్యం ఆ భర్తకు ఎన్నడూ కనిపించదు, ఊహామాత్రంగా కూడా అంతుచిక్కదు. ఇదీ జీవితంలో వ్యక్తుల మధ్య ఉండే సంబంధాల్లోని వైచిత్రి. కేవలం భార్యభర్తల మధ్యేకాదు. ఒకానొక రామారావు నాకు చాల సౌమ్యుడుగా, ఓర్పు గలవాడుగా మాత్రమే తెలుసు. మరొకరికి రామారావు అంటే ముంగి, లోపలి మనిషి, నమ్మదగినవాడుకాదు. ఈ విభేదాలు ఎందువల్ల వస్తున్నాయి?

నా ఆలోచనలకు గమ్యంలేదు. నాకు తోచిన ప్రశ్నలకి నేను సమాధానం వెదకలేదు. చివరకు నిద్రపోయాను. తెల్లవారింది. మధుర స్టేషనులో దిగాను. బండివాణ్ణి మంచి హోటలికి తీసుకువెళ్ళమన్నాను. 'రాయల్ లాడ్జి'ట. ఎందుకో కృష్ణదేవరాయలు జ్ఞాపకం వచ్చాడు. రాయలవారికి అతిథిని, 'పేయింగ్ గెస్ట్'ని అనుకున్నాను.

హోటలు మేడమీదికి మీనాక్షి దేవాలయ గోపురాలు కనిపిస్తున్నాయి. అక్కడికి దగ్గరే. సర్వరును అడిగాను. పూజ ప్రొద్దున ఎనిమిదింటికే ముగుస్తుందట. సాయంకాలం వెళ్ళమన్నాడు. దేవాలయ ప్రాకారానికి నాలుగు ద్వారాలు. ద్వారాల గోపురాలు అందంగా మెరుస్తూ కనిపిస్తున్నాయి. పునరుద్ధరణ యిటీవలే జరిగిందట. శివగంగ

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1487**

* * *